సాక్షి నిర్మల్

సోమవారం ; 18 ; మార్చి ; 2024



గ్రామాల్లో గ్రాసం కొరత

వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో గ్రాసం దొరకక పశువులు అల్లాడుతున్నాయి. నిజామాబాద్, బోధన్ ప్రాంతాల నుంచి వరిగడ్డిని కొని తెచ్చుకుంటున్నారు.

9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:28	మంగళ : 4:59

గరిష్టం/కనిష్టం
35.5 /26.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉక్కపోత అధికంగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ (కోడ్) ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమ వివరాలను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెల్లడించడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని గమనించి ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలేవరూ రావద్దని ఆయన కోరారు.

ఉద్యమాలతోనే తెలంగాణ సాధన



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న ఉద్యమకారులు

కుంటాల: ఉద్యమాలతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని తెలంగాణ ఫోరం జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎంతో కృషి చేసిన ఉద్యమకారుల సేవలు మరువలేనివన్నారు. ఉద్యమకారులంతా బంగారు తెలంగాణ లక్ష్యసాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అధ్యక్షుడు వెంకటేష్, పుండలీక్ రావు, జనార్దన్‌రెడ్డి, జుట్టు మహేందర్, కూస శంకర్, మగ్గిడి దిగంబర్, కిష్టయ్య, ముజ్జి రవి, పెంటవార్ దశరథ్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు



అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామాల సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం కోరుట్లకు చెందిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వెంకటరమణాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి జాగృతి జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు బీసీ కులాల్లో కేవలం 14 కులాలకు మాత్రమే కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, అందులో కుమ్మరి కులం లేకపోవడం దురదృష్టకరమన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుమ్మరి కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుమ్మరులు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని కుమ్మరులకు లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు.



విజయోస్తు..

- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు
- జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 8,923 మంది విద్యార్థులు
- గతేడాది రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో జిల్లా
- ఈసారి ఫలితాలపై సర్వత్రా చర్చ

నిర్మల్‌రూరల్: విద్యార్థి జీవితంలో ప్రథమ మెట్టుగా భావించే పదోతరగతి పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఈసారి జిల్లా అధికారులూ పరీక్షలపై ఆసక్తిగా ఉన్నారు. ఇందుకు గతేడాది పదోతరగతి వార్షిక పరీక్షల్లో జిల్లా ప్రథమస్థానం సాధించడమే ఇందుకు కారణం. ఈసారి కూడా ప్రథమస్థానంలో నిలుస్తుందా? లేదా? అనే చర్చ జిల్లాలో కొనసాగుతోంది.

పరీక్ష రాయనున్న విద్యార్థులు 8,923 మంది

పదోతరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 8,923 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 6,050 మంది, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,873 మంది ఉన్నారు. మొత్తంగా 4,309 మంది బాలురు, 4,614 మంది బాలికలు ఉన్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సంబంధిత విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మళ్లీ ఫస్ట్ రావాలి..

'పదోతరగతి విద్యార్థులందరికీ ఆల్ దిబెస్ట్.. మళ్లీ మన జిల్లా రాష్ట్రంలోనే ఫస్ట్ రావాలి..'అంటూ జిల్లా వాసులు చెబుతున్నారు. గతేడాది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే తొలిసారి మొదటి స్థానంలో నిలిచి ఆశ్చర్య పర్చింది. ఈసారి కూడా ఆ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లామని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మళ్లీ ఫస్ట్ వస్తామన్న నమ్మకం ఉందని చెప్పారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 9059987730 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఐదు నిమిషాల వరకు అనుమతి

ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన ఓ విద్యార్థి ప్రాణం తీయడంతో ప్రభుత్వం పదోతరగతికి ఈ నిబంధనను మార్చింది. ప్రతీ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు ఐదు నిమిషాల వరకు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఇంకా పొందని వారు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చని సూచిస్తున్నారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి

భైంసాటౌన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విద్యార్థులకు సూచించారు. నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని, తద్వారా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

అన్నీ సిద్ధం..

పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పరీక్షల నిర్వహణకు 47 మంది సీఎస్, 47 మంది డీవోలు, ఏడుగురు కస్టోడియన్ ఆఫీసర్లు, 508 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సైతం పలుమార్లు పదోతరగతి పరీక్షల నిర్వహణపై డీఈవో, ఇతర జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈమేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

వేతన వెతలు..

- ఉపాధి సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- జిల్లాలో 379 మంది సిబ్బంది



సారంగాపూర్‌లో జరుగుతున్న ఉపాధి పనుల కూలీల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో లక్ష్మారెడ్డి

జిల్లాలో ఉద్యోగుల వివరాలు

ఏపీవోలు	13
ఈసీలు	04
టీఏలు	71
కంప్యూటర్ ఆపరేటర్లు	38
ఫీల్డ్ అసిస్టెంట్లు	214
ఇతర ఉద్యోగులు	39

లోకేశ్వరం: గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఉపాధిహామీ విభాగంలో పని చేస్తున్న చిరు ఉద్యోగులకు వేతనాలు కరువయ్యాయి. నెలనెలా జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి ఇంటిని నెట్టుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉపాధిహామీ విభాగంలో జిల్లా వ్యాప్తంగా 379 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఎవరి విధులు వారివే..

ఇందులో ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల ద్వార గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయిస్తారు. ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు గుర్తించడంతో పాటు కొలతలు తీస్తారు. ఏపీవోలు వారి సంబంధిత మండలానికి అధికారిగా వ్యవహరించి పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తారు. జిల్లా అంతటా ఈ ఆరు కేడర్ల ఉద్యోగులే ఉపాధిహామీతో పాటు హరితహారం, ఇతర కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నారు. కానీ వేతనాలు సక్రమంగా అందకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ లేక...

ఉపాధిహామీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులందరి వేతనాలు రాష్ట్ర శాఖ నుంచే విడుదల కావాల్సి ఉంటుంది. ప్రతీనెల ఉద్యోగుల ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నా జీతా లు బ్యాంకు ఖాతాల్లో పడడం లేదు. రాష్ట్ర శాఖలో బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యం అవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. వేతనాలే కాకుండా జిల్లా, మండల కార్యాలయాలకు జనరల్ ఫండ్ కూడా విడుదల కావడం లేదు. దీంతో స్టేషనరీ, ఇతర ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె వాహనాలకు సైతం దాదాపు ఏడాదిగా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు.

జిల్లాలో ఉపాధి హామీ కూలీలు..

జిల్లాలో 18 మండలాలు 396 గ్రామ పంచాయతీలు ఉపాధి పథకం జాబ్ కార్డులు 16,9175 ఉండగా ఇందులో 1,08,000 పనులు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం కూలీలు 3,54,596 మంది ఉండగా ఇందులో 1,90,000 వేల మంది కూలీలు వివిధ పనులకు వస్తున్నారు. జిల్లాలో 379 మంది సిబ్బంది పనులు చేయిస్తున్నారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు.

నెలనెలా ఇవ్వాలి..



వేతనాలు ఆలస్యంగా రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. విధులకు న్యాయం చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు వేతనాలు ఆపకుండా ప్రతినెలా ఇవ్వాలి. – సంజీవ్, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

నిధులు రాగానే ఖాతాల్లో..



ఉపాధిహామీ సిబ్బందికి సంబంధించిన జీతాలు మూడు నెలాలుగా అందలేదన్నారు. ఉపాధిహామీ సిబ్బంది బడ్జెట్ నిధులు విడుదల కాగానే వారి ఖాతాల్లో జమచేస్తాం. పనులను సమర్థవంతగా నిర్వహించాలి. ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలి.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

ఆలయాల్లో భక్తుల సందడి



కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్ ఇస్లాపూర్, కిన్వట్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. చిన్నారులకు తులాభారం వేయించి, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భళా ఆరోగ్య మహిళ

- మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రతీ మంగళవారం ప్రత్యేక వైద్యపరీక్షలు
- స్థానికంగానే 8 రకాల వ్యాధులకు స్క్రీనింగ్ టెస్టులు
- ఏడాదిలో 8,251 మందికి వైద్య పరీక్షలు

ఏడాదిలో చేసిన పరీక్షల వివరాలు

రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు	: 5,505
వ్యాధి గుర్తించినవి	: 49
సిఫార్సు చేసినవి	: 36
చికిత్స పొందుతున్న వారు	: 33
నోటి క్యాన్సర్ పరీక్షలు	: 5,532
గుర్తించినవి	: 20
సిఫార్సు చేసినవి	: 15
చికిత్స పొందుతున్న వారు	: 09
గర్భాశయ ముఖద్వార స్క్రీనింగ్ పరీక్షలు	: 687
గుర్తించినవి	: 53
సిఫార్సు చేసినవి	: 33
చికిత్స పొందుతున్న వారు	: 26



మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు ఎదుర్కొంటున్న పలు అనారోగ్య సమస్యలను పరిష్కరించే దిశగా గత రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' అనే పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023 మార్చి 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడిన 100 ఆరోగ్య కేంద్రాల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ అర్బన్ ఆరోగ్య కేంద్రం, భైంసాలోని అర్బన్ పీహెచ్‌సీల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించగా ప్రస్తుతం లక్ష్మణచాంద, కుంటాల పీహెచ్‌సీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహిళల్లో 8 రకాల వ్యాధులకు సంబంధించిన 58 రకాల పరీక్షలు చేసేందుకు టీహబ్‌కు శాంపిల్స్ పంపిస్తున్నారు. రిపోర్టుల ఆధారంగా వైద్య చికిత్సలు, మందులు అందజేస్తున్నారు. ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక ఓపీ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

8 ప్యాకేజీలలో 57 రకాల వైద్య పరీక్షలు

సాధారణంగా మహిళలు ఎదుర్కొనే 8 రకాల అనారోగ్య సమస్యలకు సంబంధించి 8 ప్యాకేజీలుగా విభజించి 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక డయాగ్నోస్టిక్, క్యాన్సర్ స్క్రీనింగ్, వెయిట్ మేనేజ్‌మెంట్, మైక్రోన్యూట్రిషన్ డెఫిషియన్సీ, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్స్, పీసీవోడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, ఐవి, యూటీఐ పెల్విక్ ఇన్‌ఫ్లమెంటరీ, డీసీజెఎస్ వంటి వాటిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు

8 రకాల పరీక్షలు...

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్
3. థైరాయిడ్, సూక్ష్మ పోషకాలు గుర్తింపు, అయోడిన్, ఐరన్ లోపాలు, ఫోలిక్ యాసిడ్, విటమిన్, బీ12, డీ పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత, పెల్విక్, ఇన్ప్లమేటరీ వ్యాధులు
5. మెనోపాజ్‌దశ పరీక్షలు, హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, సంతానలేమి సమస్య
6. అల్ట్రాసౌండ్ స్కానింగ్, సెక్స్ సంబంధిత అంటువ్యాధులు
7. నెలసరి సమస్యలపై పరీక్షలు, కౌన్సిలింగ్, 57 రకాల డయాగ్నోస్టిక్స్, సీటీ స్కాన్, ఎక్స్‌రే
8. అధిక బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన

ఏడాదిలో 8,251 మందికి పరీక్షలు

ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలకు మరింత మెరుగైన చికిత్స అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని రెండు సెంటర్లలో ఏడాదిలో 8,251 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల నిర్ధారణ అనంతరం వైద్యచికిత్స అందిస్తున్నారు. తీవ్రమైన సమస్యలు ఉంటే జిల్లా జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తే మహిళలకు మరింత మేలు జరగనుంది.

మహిళలకు భరోసా..



నిత్యం ఇంటి పనుల్లో నిమగ్నమయ్యే మహిళలు ఆరోగ్యం మీద శ్రద్ధలేక అనారోగ్యం పాలవుతున్నారు. క్యాన్సర్‌లో పలు రకాలు ఉన్నప్పటికీ మహిళలు గుర్తించలేరు. పీహెచ్‌సీకి వస్తే ఉచితంగా రక్త పరీక్షలు చేసి వారిలో ఉన్న రుగ్మతలను తెలియజేసి అవగాహన కల్పిస్తాం. సరైన సమయంలో చికిత్స అందించడానికి ఆరోగ్య మహిళా కేంద్రం తోడ్పడుతుంది. రాబోయే రోజుల్లో అన్ని పీహెచ్‌సీల్లో పరీక్షలు నిర్వహిస్తాం. – డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో

వైద్యపరీక్షలు చేయించుకోవాలి



ఆరోగ్య మహిళ కార్యక్రమంలో మహిళలందరూ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలి. ప్రతీ మంగళవారం పీహెచ్‌సీలో ప్రత్యేకంగా మహిళలకు 8 రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నాం. మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రికి పంపిస్తాం. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ప్రత్యూష, పీహెచ్‌సీ వైద్యురాలు, లక్ష్మణచాంద

యంగ్లాపూర్ సమస్యలు ఏమాయె?



యంగ్లాపూర్ గ్రామానికి వెళ్లే దారి ఇదే

పెంబి మండలంలోని మారుమూల గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. యంగ్లాపూర్ గ్రామానికి సరైన రోడ్డు, కరెంటు స్తంభాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గత అసెంబ్లీ ఎన్నికలను అడ్డుకునేందుకు యత్నించారు. అధికారులు స్పందించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మరిచారు. రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



కర్ర స్తంభాలతో ప్రమాదకరంగా కరెంటు తీగలు



కరెంటు స్తంభాలకు బదులు కర్ర స్తంభాలు



కరెంటు స్తంభాలకు కర్ర స్తంభాలే తోడు

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టణంలో ఆదివారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌తోపాటు ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలి అదృశ్యం


సూర చిన్నమ్మ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు సూర చిన్నమ్మ (75) అదృశ్యమైంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. సూర చిన్నమ్మ శనివారం సాయంత్రం ముత్నూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. ఆదివారం సాయంత్రం కోడలు సూర మల్లవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

భీమిని: కన్నెపెల్లి మండల కేంద్రానికి చెందిన బాలిక (15) తప్పిపోయిందని స్థానిక ఎస్సై గంగారాం తెలిపారు. అతడి వివరాల ప్రకారం... బాలిక ఈ నెల 14వ తేదీని ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి ఇంటికి రాకపోవడం బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ కానరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్‌కు గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి టేకుల బస్తీ కొత్త బస్టాండ్ ప్రధాన రహదారిపై మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఆర్టీసీ రిటైర్డు డ్రైవర్ మహమూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నడుచుకుంటూ వెళ్తున్న మమమూద్‌ను కొత్త బస్టాండ్ వైపు నుంచి వేగంగా వచ్చి మోటార్ సైకిల్ ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు వైద్యులు రెఫర్ చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రయాణికులకు చల్లదనం పంచుతూ..



చెన్నూర్‌రూరల్: వేసవికాలం ప్రారంభమైంది. ఇప్పటికే ఎండ వేడిమికి ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ ఎండలు మరింతగా ముదిరే అవకాశాలున్నాయి. కానీ మండలంలోని అక్కెపల్లి గ్రామం నుంచి చింతలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చల్లదనాన్ని ఇస్తూ ప్రయాణికులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి ఈ వృక్షాలు. దీంతో వాహనదారులు కొంతసేపు ఆ చెట్ల నీడన సేద తీరుతున్నారు.

సూర్యఘర్‌తో వెలుగులు

- రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు
- నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్
- తపాలాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు



అర్హులు ఎవరంటే..

- 18 ఏళ్లు నిండిన భారతీయులై ఉండాలి.
- మధ్యతరగతి, పేద వర్గాలకు ప్రాధాన్యం.
- బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానమై ఉండాలి.
- సౌర ఫలకల ఏర్పాటుకు అనువైన ఇంటి పైకప్పు

కావాల్సిన ధ్రువపత్రాలు..

- ఆధార్ కార్డు
- నివాస ధ్రువీకరణ పత్రం
- ఆరునెలల విద్యుత్ బిల్లు కాపీ
- బ్యాంకు పాస్‌బుక్
- పాస్‌సైజు ఫొటో
- రేషన్ కార్డు, మొబైల్ నెం.
- అఫిడవిట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం

భైంసాటౌన్/నేరడిగొండ: సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు అందించనుంది. తద్వారా లబ్ధిదారులు తమ ఇంటి పైకప్పుపై వీటిని బిగించడం ద్వారా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పొందేలా పథకానికి రూపకల్పన చేశారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత తపాలా శాఖకు అప్పగించగా, ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభించారు. సొంతిల్లు ఉన్నవారు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు పత్రాలతో ఆన్‌లైన్‌లో లేదా స్థానిక తపాలాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను స్వీకరించి తపాలా సిబ్బంది ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. దీంతో అర్హులైనవారికి సోలార్ రూఫ్‌టాప్ పరికరాలు రాయితీపై అందించడంతోపాటు ఇంటి పైకప్పుపై సౌర ఫలకలు బిగించి ఇస్తారు.

గృహజ్యోతి పొందలేనివారికి ప్రయోజనం..

రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డుదారులకు గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఆపై యూనిట్లు వాడే వారికి జీరో బిల్లు వర్తించదని పేర్కొంది. దీంతో అధిక విద్యుత్ వినియోగదారులు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో ప్రయోజనం పొందవచ్చు. ఇందుకు గాను సొంత ఇల్లుతోపాటు యజమాని పేరిట విద్యుత్ కనెక్షన్ ఉండాలి. విద్యుత్ బిల్లు, ఆధార్, ఇతర ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. సౌర ఫలకలు అమర్చేందుకు ఇంటి పైకప్పుపై అనువైన స్థలం ఉండాలి. కిలోవాట్ సామర్థ్యం ఉన్న సౌర ఫలక బిగించేందుకు 10 చదరపు మీటర్ల స్థలం అవసరం. కిలోవాట్ సామర్థ్యం ఉన్న సౌరఫలకం రోజుకు నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. వినియోగాన్ని బట్టి ఫలకలు బిగించుకోవచ్చు.

దరఖాస్తు చేయాలి

సూర్యఘర్ పథకానికి వెబ్‌సైట్ www. pm.suryaghar.gov.in,https//pm suryaghar.g ov.inల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. కిలో వాట్‌సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు రూ.125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. దీంతో వినియోగదారులు డిస్కమ్ నుంచి కనీస విద్యుత్ బిల్లులను పొందే అవకాశం ఉంటుంది. వినియోగదారుడు 5 నుంచి 6 ఏళ్ల లోగా తాను పెట్టిన మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ప్రభుత్వం తపాలా శాఖకు అప్పగించింది. ఆసక్తి ఉన్నవారు తపాలా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి 40 శాతం రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు అందిస్తారు. విద్యుత్ బిల్లు, మొబైల్ నం, ఇతర వివరాలతో సంప్రదించాలి.

– జి.దిలీప్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, భైంసా

విస్తృత ప్రచారం చేపడుతున్నాం



పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం అమలుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. పేద, మధ్య తరగతి ప్రజలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందడంతోపాటు అదనపు ఉత్పత్తిని డిస్కంలకు విక్రయించే వెసులుబాటు ఉంది. గ్రామీణ, పట్టణ పోస్టల్ సిబ్బంది ఈ పథకంపై సర్వే చేపట్టారు.

– కె.మహేశ్‌రెడ్డి, నేరడిగొండ పోస్టల్ శాఖ అధికారి

పోలీసుల అదుపులో నిందితుడు?

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శివారు పంటచేనులో ఈనెల 13న నవజాత శిశువును వదిలిన విషయం తెలిసిందే. శిశువు ఏడుపు విని గ్రామస్తులు చేరదీసి పోలీసులకు అప్పజెప్పారు. భీంపూర్ పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం మగబిడ్డ సురక్షితంగా ఉన్నాడు. మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ నవజాత శిశువును వదిలేసినట్లు భావించిన భీంపూర్ పోలీసులు దర్యాప్తు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు వరుసకు మరదలి అయిన మైనర్ బాలికను మోసగించి గర్భిణి చేశాడు. ఏమి చేయలేని పరిస్థితుల్లో నవజాత శిశువుకు జన్మనిచ్చి వదిలేసినట్లు తెలుస్తోంది. నిందితుడైన యువకుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆస్పత్రికి సెలవే..!


ఉదయం 11:41 గంటలకు డ్యూటీకీ వస్తున్న ఏఎన్‌ఎం రేఖ

కడెం: వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం రోగులకు శాపంగా మారింది. ఆదివారం వస్తే చాలు..కడెం పీహెచ్‌సీ సిబ్బంది ఆస్పత్రికి సెలవు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వాచ్‌మెన్ పెద్దులు తప్ప, వైద్య సిబ్బంది లేరు. డాక్టర్ ఆదివారం అందుబాటులో ఉండడు. రోగులకు వైద్యసేవలందించాల్సిన ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్సు లేరు. సుదూర ప్రాంతాల రోగులు వచ్చి నిరాశతో వెనుదిరిగారు. ఓపీ చూడాల్సిన ఏఎన్ఎం రేఖ తీరిగ్గా ఉదయం 11.41 గంటలకు వచ్చింది. అప్పటికే ఔట్ పేషంట్లు వెళ్లిపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేరు.

ప్రాణాలు తీశారు..

- పక్కకు జరగమన్నందుకు..
- తాగిన మైకంలో వ్యక్తి హత్య
- మరొకరికి తీవ్ర గాయాలు


రాజు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: తాగిన మైకంలో జరిగిన గొడవలో ఓ నిండు ప్రాణం బలైంది. కూలీ, నాలీ చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇద్దరు పిల్లలకు తండ్రిని దూరంచేసింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన అడ్లూరి కాంతా–ఆనంద్‌రావులకు నలుగురు సంతానం. వీరిలో రెండో కుమారుడైన అడ్లూరి రాజు (30) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రాణి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఎనిమిదేళ్ల వయసున్నా కూతురు అక్షరితీ, నాలుగేళ్ల కుమారుడు విక్కీ ఉన్నారు. ప్రస్తుతం వీరు శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. కాగా, శనివారం తన తల్లిదండ్రులను చూసేందుకు బాలాజీనగర్‌కు వెళ్లిన రాజు సాయంత్రం 6 గంటల సమయంలో తిరుగుపయనమయ్యాడు. వినాయక్‌చౌక్‌లోని వైన్స్ వద్ద తన బావమరిది అయిన సాగర్‌తో కలిసి మద్యం తాగాడు. పట్టణానికి చెందిన వినోద్, ప్రవీణ్‌లు వీరి పక్కన కూర్చుని మద్యం సేవించారు. కొంచెం పక్కకు జరగాలని కోరగా వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. రాజు, సాగర్‌లు వినాయక్‌చౌక్ నుంచి గాంధీపార్కు వైపు స్కూటీపై వెళ్తున్నారు. కక్ష మదిలో పెట్టుకున్న ప్రవీణ్, వినోద్‌లు ఆటోలో వారిని వెంబడించారు. గాంధీ పార్కు వద్ద వారిని అడ్డుకుని రాత్రి 9 గంటల ప్రాంతంలో దాడికి పాల్పడ్డారు. రాజు తీవ్రగాయాల పాలై సంఘటన స్థలంలో మృతి చెందగా గాయాలైన సాగర్‌ను స్థానికులు రిమ్స్‌కు తరలించారు. స్థానికుల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకున్నప్పటికి అప్పటికే రాజు మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదుతో సీఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


భీమన్న మృతదేహం

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పీచర గ్రామానికి చెందిన రుద్రారపు భీమన్న (38)కు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో శనివారం గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..


శ్రీకాంత్(ఫైల్)

కుంటాల: మండల కేంద్రానికి చెందిన యువకుడు కొండం శ్రీకాంత్(20) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవరావు కథనం ప్రకారం.. శ్రీకాంత్ రోజు కూలీచేస్తున్న జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో గతేడాది క్రితం పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కుంటాల గ్రామ శివారులో వారి మధ్య ఆదివారం గొడవ జరిగింది. క్షణికావేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి తల్లితో పాటు తమ్ముడు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి..

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కదం అబాజీ (35) గత కొన్నేళ్లుగా మద్యానికి అలవాటుపడ్డాడు. రెండు రోజుల క్రితం మృతుడి భార్య సంగీత శుభకార్యానికి వెళ్లింది. రెండు రోజులుగా అబాజీ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మారోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు కిందపడి యువతి..

బెల్లంపల్లి: పెళ్లి కావడం లేదనే మనోవ్యథతో ఓ యువతి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం... బెల్లంపల్లి టేకుల బస్తీకి చెందిన కొత్తూరు సుమలత (39) ఉదయం ఇంటి పనులు ముగించుకుని కన్నాల రైల్వేగేట్ వద్దకు వెళ్లింది. గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లీడు దాటి పోతున్న వివాహం కావడం లేదనే బాధతో ఆత్మహత్య చేసుకుందని జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సోలార్ తీగకు తగిలి మహిళ మృతి

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరి లక్ష్మి (55) ఆదివారం పంట రక్షణకు ఏర్పాటు చేసిన సోలార్ తీగకు తగిలి మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి ఏళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఆదివారం తమ పంట పొలంలో కూరగాయలు కొయడానికి వెళ్లింది. కూరగాయలు కోస్తున్న క్రమంలో లక్ష్మికి మూర్ఛ రావడంతో కిందపడగా పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగకు తగిలడంతో షాక్‌తో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిర్పూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

సిర్పూర్(టి): మండలం మీదుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న మొత్తం రూ.5,26,650 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనంలో నరులే భరత్ వద్ద రూ. 2,72,520 నగదుతో మహారాష్ట్రలోని రాజూరా పట్టణం నుంచి కౌటాల మండలానికి తీసుకెళ్తుండగా, అలాగే నాజీమ్ సలీం బక్ష్ చంద్రపూర్ పట్టణం నుంచి బెజ్జూర్ మండలానికి రూ.1,84,000 నగదు తరలిస్తుండగా, ఇంద్రజిత్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి చత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా అతడి వాహనంలో రూ.70వేలకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై డికొండ రమేష్ తెలిపారు.

నగదు పట్టివేత...

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు ఆదివారం ఫ్లెయింగ్ స్క్వాడ్ డెప్యూటీ తహసీల్దార్ రఘునాథ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సంఘం బస్తీకి చెందిన ఓ వ్యాపారి వద్ద రూ.1,30,000 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుకున్న నగదును కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు.

ఫేస్‌బుక్‌లో ప్రకటనతో మోసం

- రూ.1.43 లక్షలు టోకరా
- వాంకిడిలో సైబర్ కేసు నమోదు

వాంకిడి: తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టిన పాపానికి ఓ యువకుడు రూ.1.43 లక్షలు మోసపోయిన ఘటన వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని పిప్పర్‌గొంది గ్రామానికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ అనే యువకుడు ఈ నెల 5వ తేదీన తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టాడు. అయితే వెంటనే 8579861593 నంబరు నుంచి రామ అగార్వల్ ఆర్మీ ఆఫీసర్ అనే పేరుతో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన చంద్రకాంత్ రూ.1.35 లక్షలకు కారు కొనేందుకు బేరం కుదుర్చుకున్నాడు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.3 వేలు పంపాలని చెప్పడంతో ఆయన ఇచ్చిన అకౌంట్ నంబరుకు ఫోన్‌పే ద్వారా పంపించాడు. 6వ తేదీన మళ్లీ ఫోన్ చేసి కంటైనర్ కిరాయి రూ.5 వేలు, ఆపై రూ.11 వేలు, రూ.11,900, తర్వాత మళ్లీ డాక్యుమెంట్ చార్జీలు అని రూ.21,500, రూ.36,999, రూ.58 వేలు, రూ.19500, రూ.18,500, రూ.2 వేలు, రూ.58వేలు ఇలా మొత్తం రై.1,43,498 పంపించాడు. మళ్లీ ఫోన్ చేసి రూ.61 వేలు పంపించాలిందిగా కోరగా బాధితుడు ఇక నా వద్ద డబ్బులు లేవని తెలపడంతో అటు వైపు నుంచి ఫోన్ కట్ అయింది. తర్వాత ఎంత ప్రయత్నించిన ఆ వ్యక్తికి ఫోన్ కలవకపోవడంతో మోసపోయానని గ్రహించి వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. బాధితుడు రాథోడ్ చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

గోదాంలో ధాన్యం బస్తాల చోరీ


బయటపెట్టిన ధాన్యం బస్తాలు

భీమారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన గోదాంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకీ పాల్పడ్డారు. ఎస్సై రాములు వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గోదాం వద్ద టార్చిలైట్ల వెలుతురు కనిపించడంతో స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లగా ఆటోరిక్షా ట్రాలీనీ తీసుకొని పారిపోయారు. సంఘటనా స్థలాన్ని స్థానికులు పరిశీలించగా గోదాం షెట్టరు తాళాలు పగులగొట్టి ఉండటమే కాకుండా 55 ధాన్యం బస్తాలు కుప్పగా బయట కనిపించాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోదాంలో నిల్వ ఉంచిన ధాన్యం సంచులు హాజీపూర్ మండల నర్సింగాపూర్ గ్రామంలోని దుర్గ ఇండస్ట్రీస్‌కు చెందినవిగా గుర్తించారు. మిల్లు యజమాని దర్శనాల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సుమారు రూ.95వేల విలువ గల ధాన్యం చోరీకి గురైనట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి


వినతి పత్రంఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల్‌క్రైం: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వాయిదా అంజామ్ (18) మృతిపై పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గురుకుల నిర్వాహకురాలు నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. ఈనెల 12 న ఇంటర్ పరీక్షలు రాసి అనారోగ్యానికి గురైందని, సరైన సమయంలో వైద్యం అందించడంలో గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. విద్యార్థిని మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, నాయకులు తిరుపతి, అభినవ్, అరవింద్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. మొక్కజొన్న పంటలు నేలకొరిగింది. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు నేలకొరగా, పలుచోట్ల పడిపోయాయి. పొట్టపెల్లి నుంచి లక్ష్మణచాందకు వెళ్లే డబుల్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు విరిగిపోయాయి.


పొట్టపెల్లి వద్ద రోడ్డుపై పడిపోయిన చెట్టు


కేజీబీవీ వద్ద నేలకొరిగిన చెట్టు


పీచరలో నేలకొరిగిన మొక్కజొన్న

క్లుప్తంగా

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కడెం: ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యతని.. ఆ మహమ్మారి బారిన పడకుండా వైద్యులు చెప్పిన జాగ్రత్తలు పాటించాలని కళాజాత బృందం సభ్యులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వారసంతలో ఆదివారం ఎయిడ్స్ నిర్మూలన జిల్లా సంస్థ ఆధ్వర్యంలో నటరాజ్ కళాజాత బృందం ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎల్‌డబ్ల్యూ లత, కళాకారులు శ్రీధర్, ఆనంద్, వీరేశ్, దత్తు, ఉల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సల్ల రాజు అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా రాజు చిన్ననాటి మిత్రులు ఆదివారం దిలావార్‌పూర్ వెళ్లి బాధిత కుటుంబానికి రూ.25,500ను ఆర్థికసాయంగా అందించారు. సదరు మొత్తం రాజు కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేశ్, అజీమ్, కృష్ణమూర్తి, దివాకర్, రాజేశ్వర్, రాకేశ్, అశోక్, శ్రీనివాస్, సునీల్, గంగేశ్వర్, జలేందర్, రవి, రాజు ఉన్నారు.

మల్లన్న పట్నాల వేడుకలు

కడెం: మండల కేంద్రంలోని పెద్దూర్‌కు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న పట్నాల ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బైండ్లోల్ల ఆటపాటలు, డప్పుచప్పుళ్లతో పాలపోరక, మంగళహారతులతో మల్లన్న ఆలయానికి చేరుకుని ఉత్సవాలు ప్రారంభించారు. సోమవారం మల్లన్న పట్నాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెద్ద గొల్ల గజ్జి ఈజన్న తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు సంఘ పో శన్న, కార్యదర్శి జక్కుల మల్లేశ్, క్యాషియర్ వెంకటేశ్, చిన్నగంగన్న, తోట్ల క్రాంతి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వర్తక, వ్యాపారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పని చేయని కెమెరాలకు మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, వ్యాపారులు ఉన్నారు.

గోడలపై రాతల తొలగింపు


రాతలను చెరిపివేస్తున్న సిబ్బంది

కుంటాల: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కుంటాలలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల గోడలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన రాతలను పంచాయతీ సిబ్బంది చెరిపివేశారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

ఉస్మాన్‌అలీకి నివాళి

ఖానాపూర్: పట్టణానికి చెందిన టీఎన్జీవో మాజీ నాయకుడు ఉస్మాన్‌అలీ అనారోగ్యంతో మృతి చెందగా.. ఆ సంఘం మండల నాయకులు వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లోని మృతుడి నివాసానికి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న, నాయకులు సుధాకర్‌రావు, ఏనుగు అశోక్‌రెడ్డి, ఎంసీ గంగాధర్ వెళ్లి నివాళులర్పించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉస్మాన్‌అలీ చేసిన సేవలను కొనియాడారు.

గ్రామాల్లో గ్రాసం కొరత

- అల్లాడుతున్న మూగజీవాలు
- పశువులను విక్రయించేందుకు సంతకు తరలిస్తున్న రైతులు
- సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించాలని అధికారులకు వేడుకోలు


మహారాష్ట్ర నుంచి ట్రాక్టర్‌పై పశుగ్రాసం తీసుకొస్తున్న బోల్సా రైతు

తానూరు: వేసవి ప్రారంభంలోనే మండలంలో గ్రాసం దొరకక పశువులు అల్లాడుతున్నాయి. దీంతో మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశుపోషణ భారమైనా, స్థానికంగా గడ్డి దొరకకున్నా.. కొందరు రైతులు అధిక ధరలు వెచ్చించి మహారాష్ట్రలోని ధర్మాబాద్, బన్నెల్లి, కర్కెలి, సావర్‌గాం ప్రాంతాల నుంచి మొక్కజొన్న, జొన్న కట్టలను.. నిజామాబాద్, బోధన్ ప్రాంతాల నుంచి వరిగడ్డిని కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు పశుపోషణ భారం కావడంతో తమ పశువులను సంతకు తరలించి విక్రయిస్తున్నారు.

పశుగ్రాసం కొరత .

ఈసారి వానాకాలంలో సాగు చేసిన జొన్న పంట అధిక వర్షాలతో చేతికి రాకుండా పోయింది. ఇప్పుడు ఎండలు పెరిగి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోరుబావుల్లోనూ నీటి లభ్యత తక్కువ ఉండడంతో రైతులు పెద్దజొన్న, వరి పంటను తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సౌకర్యం లేక పెద్దజొన్న పంట ఎండిపోయింది. దీంతో పశుగ్రాసం కొరత నెలకొంది. గతంలో తానూరు మండలంలోని జౌలా(బి), ఎల్వత్, వడ్గాం, జౌలా(కే) గ్రామాల్లో గడ్డి విరివిగా లభించేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతంలో పశుసంవర్ధక శాఖ, ఉపాధిహామీ ద్వారా పశుగ్రాసం విత్తనాలను రాయితీపై అందించేవారు.


అమ్మేందుకు పశువులను తరలిస్తున్న దృశ్యం


బోధన్ నుంచి తీసుకొస్తున్న వరిగడ్డి

పక్క రాష్ట్రం నుంచి..

మండలంలోని ఆయా గ్రామాల పాడి రైతులు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా వరిగడ్డిని తెచ్చుకుంటున్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్, రత్నెల్లి, బాలాపూర్ గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ఆటోలపై జొన్నకట్టలను తెచ్చుకుంటున్నారు. రెండేళ్ల నుంచి పశుగ్రాసం కొరతతో పలువురు రైతులు పశువులను సంతకు తరలించి విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు భారమైనా వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పశుగ్రాసం కొరత తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు విజ్ఞప్తి చేసున్నారు. ఇటీవల పెద్దజొన్న, మొక్కజొన్న పంటలు నెల కిందట కురిసిన రాళ్ల వానకు దెబ్బ తిన్నాయి. కనీసం చొప్ప చేతికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువులను అమ్మేస్తున్నాం



మేత దొరకకపోవడంతో పశువులను అమ్మేందుకు అంగడికి తీసుకెళ్తున్నాం. నెల కిందట కురిసిన అకాల వర్షంతో పెద్దజొన్న, మొక్కజొన్న పంటలు చేతికి రాకుండా పోయాయి. అధికారులు గడ్డి విత్తనాలు అందించి ఆదుకోవాలి.

– లక్ష్మణ్‌పటేల్, రైతు, హిప్నెల్లి

ధర ఎక్కువైనా కొంటున్నాం



గతంలో మాదిరి పశువులకు గడ్డి దొరకడం లేదు. వాటిని అమ్మేందుకు మనసు రావడం లేదు. పశువుల కోసం ధర ఎక్కువైనా వివిధ ప్రాంతాల నుంచి గడ్డిని కొని ఎడ్లబండి, ట్రాక్టర్ల ద్వారా ఇంటికి తెచ్చుకుంటున్నాం.

– గంగాధర్ పటేల్, రైతు, ఉమ్రి(కే)

సబ్సిడీ విత్తనాలు అందేలా చూస్తాం

ప్రస్తుతం గడ్డివిత్తనాలు పశువైద్యశాలలో అందుబాటులో లేవు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. గడ్డి విత్తనాలు రాగానే పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తాం.

– గోపాల్ మహాజన్, పశువైద్యాధికారి

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులేవి?



ప్రమాదకరంగా కామోల్ రోడ్డు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామ సమీపంలో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. భారీవర్షాలకు రోడ్డు రెండు చోట్ల దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. పలువురు వాహనదారులు అదుపుతప్పి కింద పడిన ఘటనలున్నాయి. రోడ్డు మరమ్మత్తుల విషయమై అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరగక ముందే అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ డి. రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని రాహుల్‌నగర్‌లో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 86 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు, పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ


సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

కడెం: నాటి వైఎస్సార్ నుంచి నేటి రేవంత్‌రెడ్డి వరకు కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతోనే కడెం ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్లిందన్నారు. ప్రాజెక్ట్ గేట్లు దెబ్బతిన్నా.. మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులకు రూ.5.46 కోట్లు, విద్యుత్ మరమ్మతులకు రూ.3.81 కోట్లు మంజూరు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఆయకట్టు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, జగన్‌రెడ్డి, సత్యం, సలీం, రహీం, సత్యంచారి, యాదగిరి, అశోక్, భీమేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ముధోల్: సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి జి.మైసాజీ తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 660 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా.. నాలుగు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముధోల్‌లోని ఆశ్రమ పాఠశాల, రబీంద్ర పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆష్టాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సెంటర్లుగా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని.. విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: పదోతరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈవో మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 240 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, ఉన్నత పాఠశాలలో 203మంది పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరిటెండెంట్‌లుగా నాగేశ్‌బాబు, సంధ్యారాణి, రమేశ్ వ్యవహరిస్తారని అన్నారు. పెంబి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 118 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం


శ్రీహరిరావును సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును నర్సాపూర్(జి) గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. నర్సాపూర్(జి)లో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉమ మహేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు



ఈ చిత్రంలో కన్పిస్తున్నది మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ బాలుర వసతిగృహం, సహకార జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు. గతంలో ఈ మార్గంలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. కానీ ఇటీవల నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్డును నిర్మించారు. దీంతో అటువైపు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కింది చిత్రంలో కనిపిస్తున్నది లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) గ్రామంలోని ఎస్సీ కాలనీ రోడ్డు. గతంలో కంకర తేలి గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. కానీ ఇటీవల సీసీ రోడ్డు నిర్మించడంతో తమ ఇబ్బందులు తొలగిపోయాయని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



- లక్ష్మణచాంద మండలానికి రూ.2 కోట్లు మంజూరు
- గ్రామాల్లో కొనసాగుతున్న పనులు
- పూర్తి చేసేందుకు ఈనెలాఖరు గడువు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. కానీ ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడేవాళ్లమని.. రోడ్ల నిర్మాణంతో తమ ఇక్కట్లు దూరం అవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండలవ్యాప్తంగా రోడ్లు నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ అధికారులు అంటున్నారు.

మార్చి 31 వరకు..

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఈనెల 31 వరకు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కాంట్రాక్టర్లు సకాలంలో సీసీ పనులు పూర్తి చేసేలా పీఆర్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇబ్బందులు తొలిగాయి



గతంలో పొట్టపెల్లిలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడేవారు. కాని నేడు సీసీ రోడ్డు వేయడంతో మా ఇబ్బందులు తొలిగిపోయాయి.

– అశోక్, పొట్టపెల్లి వీడీసీ సభ్యుడు

31లోగా పూర్తి చేయాలి

మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఈనెల 31లోగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఎప్పటికప్పుడు పనులు నాణ్యతతో పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం.

– శ్రీధర్, పీఆర్ ఏఈ

అటెన్షన్ ప్లీజ్.. కోతుల బెడద తీర్చాలి



ఖానాపూర్: పట్టణంలో రోజురోజుకూ కోతుల సంఖ్య పెరగడంతో జనం ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు వృద్ధులు, చిన్నారులపై దాడి చేస్తున్నాయి. ఇళ్లలోకి రాకుండా రక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 78421 50545

సన్మానం

ఖానాపూర్: ఖానాపూర్ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి పాటు పడతానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అ న్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీరాంనగర్‌లో ము న్నూరుకాపు సంఘ సభ్యులు చైర్మన్‌తోపాటు వైస్‌చైర్మన్ కావలి సంతోష్‌ను సన్మానించారు. నాయిని సంతోష్, సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఖానాపూర్: తమ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సత్తన్‌పల్లి గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కోరారు. ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. గంగారెడ్డి, రమేశ్ తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కుంటాల: తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో కుంటాలలో ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా జి.రమేశ్‌గౌడ్, మండలాధ్యక్షుడిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా మగ్గిడి దిగంబర్, కార్యదర్శిగా పెంటవార్ దశరథ్, కోశాధికారిగా రజనీకాంత్, సహకార కార్యదర్శిగా భోగ లక్ష్మణ్, జిల్లా సభ్యులుగా జుట్టు మహేందర్, కూస శంకర్, రావుల వనిత, మండల సభ్యులుగా పోశెట్టి, సిందె దత్తు, నాగరాజు, రమేశ్, దత్తురాం, గంగాధర్, రవీందర్, రాకేశ్, మచ్చేందర్, అరవింద్, మీడియా ప్రతినిధులుగా రవికుమార్, జగన్‌రెడ్డి, సాయిబాబాను ఎన్నుకున్నారు.

ఈ ప్రయాణం వద్దు



లక్ష్మణచాంద మండలం తిర్పెల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా ఓ వ్యక్తి తన బైక్‌పై ఐదుగురితో వెళ్తుండగా కానిస్టేబుల్ సంజీవ్ ఆపివేశాడు. రెండు చేతులు జోడించి అభివాదం చేస్తూ పరిమితికి మించి ప్రయాణించడం వలన జరిగే అనర్థాలను వారికి వివరించారు.

– లక్ష్మణచాంద

కరాటే సాధనతో ఆత్మరక్షణ


విద్యార్థులతో ఎంపీపీ గజ్జారాం, తదితరులు

కుంటాల: ఆత్మరక్షణకు కరాటే సాధన ఉపయోగపడుతుందని ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, జపాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేందర్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలోని విజయసాయి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 27 మందికి బెల్టులు,గ్రేడింగ్ పత్రాలు అందజేశారు. ఏఎస్సై దేవ్‌రావు, ప్రిన్సిపాల్ స్వప్న, వైస్‌ప్రిన్సిపాల్ మురళి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎ.భూషణ్, మాస్టర్లు రాజ్‌కుమార్, వంశీ, రీజక్‌సింగ్, గజేందర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.